

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

మంచిర్యాల కలెక్టరేట్, మే 1: వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ అనిత అన్నారు. బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ప్రోగ్రాం ఆఫీసర్లు, మినిస్టర్ స్టాఫ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. వడదెబ్బ నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ విశ్వేశ్వర్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు ఫయాజ్, అనిల్, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మంచిర్యాలలో సీపీఐ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న కలవేన శంకర్







చెన్నూరులో కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, మంచిర్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు, ఆర్టీసీ డిపోలో జెండా ఎగురవేస్తున్న నాయకులు

ఘనంగా మే డే

- రెపరెపలాడిన ఎర్ర జెండాలు
- కార్మిక సంఘాలు, వివిధ యూనియన్ల ఆధ్వర్యంలో జెండాల ఆవిష్కరణ
- ర్యాలీలతో కదం తొక్కిన కార్మికులు

మంచిర్యాల, మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మే డే ఉత్సవాలను కార్మిక సంఘాల నాయ కులు బుధ వారం ఘనంగా జరుపుకున్నారు. సింగరేణి గనులు, వివిద కార్మిక సంఘాల కార్యాల యాల వద్ద జెండాలు ఆవిష్కరించి, కేకులు కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం, హమలి సంఘం, ఇఫ్టూ, ఐఎన్‌టీయూసీ, కూరగాయల కార్మిక సంఘం, సీపీఐ, ఆధ్వర్యంలో ఆయా సంఘాలకు చెందిన కార్మికులు పెద్ద ఎత్తున వేడుకల్లో పాల్గొన్నారు. మే డే వేడుకల్లో సంఘటిత, అసంఘిత కార్మికులు తరలి రావడంతో జిల్లా అంతటా ఎరు పెక్కింది. జిల్లా కేంద్రంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు ర్యాలీలు నిర్వహించారు.

మంచిర్యాల కలెక్టరేట్: సీపీఐఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా పార్టీ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డు చౌరస్తాలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మే డే జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు జాడి దేవరాజ్, దేవయ్య, భూమయ్య, రమేష్, మజీద్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే మంచిర్యాలలోని ఆర్టీసీ బస్ డిపోలు మేడేను ఘనంగా నిర్వహించారు. యూనియన్ నాయకులు జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో కలవేన శంకర్, మేకల దాసు తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐఎంఎల్ న్యూడెమో క్రసీ కార్యాలయంలో ఐఎఫ్‌టీయూ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ మే డే నిర్వహించారు. న్యూడెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాల్‌కుమార్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మల్లన్న, రాజన్న, చిన్నయ్య, సాజిత్, గణేష్, పరమేష్, శ్రీనివాస్,లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని ఇటుక బట్టీల స్థలం వద్ద మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇటుకబట్టి కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి జయరావు, అధ్యక్షుడు లచ్చన్న, ప్రధాన కార్యదర్శి లస్మయ్యలు మే డే జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్, అంజి, కార్మికులు పాల్గొన్నారు.

ఏసీసీ: జిల్లా కేంద్రంలో మేడే వేడుకలను కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా అధ్యక్షుడు పడాల రామన్న మేడే జెండాను ఆవిష్కరించారు. అనంతరం శ్రీనివాసటాకీస్ నుంచి రైల్వే స్టేషన్, బెల్లంపల్లి చౌరస్తా మీదుగా ఓవర్ బ్రిడ్జి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మంచర్ల సదానందం, గుండ లచ్చన్న, చంద్రయ్య, రమేష్, శ్రీనివాస్, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆవునూరి గోపాల్, గట్టయ్య, కుమారస్వామి, బాబన్న, జర్నలిస్టు ఎండీ మునీ ర్, న్యాయవాది రాకేష్ పాల్గొన్నారు. అంబేద్కర్ మున్సిపల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు తూముల నరేష్, కౌన్సిలర్ సత్యనారాయణ, సంఘం గౌరవాధ్యక్షుడు బానేష్, సదానందం, నగేష్, ప్రభాకర్, శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో మే డే వేడుకలను మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. కార్యక్రమంలో సుదమల్ల హరికృష్ణ, శ్యాంకుమార్, రామస్వామి, సుధాకర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల డ్రైవర్లు, క్లీనర్ల సంఘం ఆధ్వర్యంలో మంచిర్యాలలో జెండా ఆవిష్కరించి అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జైపాల్ సింగ్, చంద్రయ్యమోబిన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని మార్కెట్ ఏరియాలో కొంతకా లంగా మతి స్థిమితం లేక తిరుగుతున్న కార్మికుడిని మేడే దినోత్సవం సందర్భంగా కుమరం భీం సేవా సమితి సభ్యులు చేరదేసి క్షవరం, స్నానం చేయించారు. కార్మికుడు లచ్చయ్య గతంలో కాగజ్‌నగర్ పేపరు మిల్లులో పనిచేసేవాడని, మానసిక స్థితి సరిగ్గా లేక మంచిర్యాల పట్టణంలో తిరుగుండేవాడని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో చిలువేరు పున్నం, సభ్యులు పాల్గొన్నారు.

నస్పూర్: ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా నస్పూర్ పట్టణంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో బుధవారం పలు కార్మిక వాడల్లో జెండాలను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ హాజరు కాగా గోదావరి కాలనీ చౌరస్తాలో పట్టణ కార్యదర్శి మిర్యాల రాజేశ్వర్‌రావు, నస్పూర్ కాలనీలో సహాయ కార్యదర్శి లింగం రవిలు ఎర్ర జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు జోగుల మల్లయ్య, కారుకూరి నగేష్, ముస్కె సమ్మయ్య, కొట్టె కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేటరూరల్: పట్టణంలో ఏఐటీయూసీ సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మేడే వేడుకలను నిర్వహించారు. ఉత్కూరు చౌరస్తాలో ఏఐటీయూసీ సీపీ ఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, మార్కెట్ యార్డులో హమాలీ సంఘం నాయకులు, పాత బస్టాండ్, దౌడపల్లిలో ఆటో యూనియన్ నాయకులు జెండాలు ఎగురవేశారు. కార్యక్రమాల్లో రమణారెడ్డి, ప్రభాకర్, రవి, సత్తన్న, మల్లేష్, వెంకటేష్, రవికిరణ్, ప్రకాశం, రాందాస్ పాల్గొన్నారు.

దండేపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను పూర్తిగా విస్మరించి కార్పోరేట్ శక్తుల కొమ్ముకాస్తున్నన్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మేదరి దేవవరం, మండల కార్యదిర్శ పెర్క రాజేష్ అన్నారు. దండేపల్లిలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కోయపోచగూడలో భూపోరాట కేంద్రంలో ఆదివాసీ గిరిజనులు బుధవారం మే డే సందర్భంగా జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో కేతిరెడ్డి రమణరెడ్డి, జిల్లాపెల్లి భానుచందర్, బొమ్మన అశోక్, తగారపు సుధాకర్, కొట్లూరి నర్సయ్య ముల్కల్ల శంకరయ్య, దోసండ్ల ఎల్లయ్య, మాదికుంట రమేష్, దొసండ్ల శ్యామల, రాయలింగు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలోని టీఎస్‌టీయూసీ కార్యాలయంలో మే డే జెండాను ఎస్సీఎల్‌యూ ఉపాధ్యక్షుడు గద్దల నారాయణ, టీఎస్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మణిరాంసింగ్ ఆవిష్కరించారు. అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జీవరత్నం, మల్లయ్య, హసన్, నారాయణ, సాగర్, తిరుపతి, రమేష్, శంకరయ్య, వెంకటేష్, కరుణాకర్, పోశం పాల్గొన్నారు. కాగా పట్టణంలోని పెద్ద హమాలీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం మేడేను నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు గెల్లి రాజలింగు యాదవ్ మే డే జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సురేష్, హమాలీ సంఘం సభ్యు లు సమ్మయ్య, రాజ్‌కుమార్, శ్రీనివాస్, ప్రవీణ్, అయాజ్ పాల్గొన్నారు.

చెన్నూరు: చెన్నూరు పట్టణంలో మే డే వేడుకలను ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం నిర్వహించారు. ఎంఆర్‌పీఎస్‌టీఎస్ జిల్లా అధ్యక్షుడు తగరం మధురాజ్ కార్మికులను ఘనంగా సన్మానించారు. స్వీట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మన దేశంలో కార్మికులకు అనేక హక్కులు కల్పించింది డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు పున్నం, ముత్యాలు, ప్రశాంత్, పోశం, శ్రీధర్, దుర్గయ్య, మల్లేష్, నాగరాజు, శేఖర్, ఆగయ్య పాల్గొన్నారు. అలాగే సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం చెన్నూరులో మే డేను నిర్వహించారు. మండల కార్యదర్శి సమ్మయ్య జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చందు, రంజిత్‌కుమార్,సతీష్, ఎల్లయ్య, సంజయ్, శశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: పట్టణంలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఐఎన్‌టీయూసీ నాయకులు బుధవారం మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు కాంపెల్లి సమ్మయ్యదేవి భూమయ్యలు జెండాను ఆవిష్కరించారు.

రామకృష్ణాపూర్: సీఐటీయూ ఆధ్వర్యంలో ఏరియాలో జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శి అల్లి రాజేందర్, ఉపాధ్యక్షులు రామగిరి రామస్వామి, రమణ, వడ్లకొండ ఐలయ్య, సీనియర్ నాయకులు అలవాల సంజీవ్, ఆర్గనైజర్ భేతి భరత్, వివిధ గనుల పిట్ సెక్రటరీలు బుద్దె సురేష్, జడల ప్రవీణ్, సంకె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తాండూర్: తాండూర్‌లో మే డే వేడుకలను బుధవారం కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఐబీలోని భగత్‌సింగ్ భవనం వద్ద సీపీఐ నాయకులు రేగుంట చంద్రశేఖర్, సీపీఎం, సీఐటీయూ నాయకులు జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో విజయలక్ష్మీ, నాయకులు పాల్గొన్నారు. అలాగే మాదారం టౌన్‌షిప్‌లో ఐఎన్‌టీయూసీ, టీబీజీకేఎస్, ఐఎఫ్‌టీయూ నాయకులు వేరు వేరుగా జెండాలను ఎగురవేశారు. కార్యక్రమాల్లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దాగం రాజారాం, నాయకులు బానేష్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, మంగీలాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నెన్నెల: ఆవడం, కొత్తూరు, గుండ్లసోమారం, నందులపల్లి, నార్వాయిపేట, మైలారం, గొళ్లపల్లి గ్రామాల్లో మే డే సందర్భంగా అరుణ పతాకాలు రెపరెపలాడాయి. మండల కేంద్రంలోని కుశ్నపల్లి చౌరస్తా వద్ద ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు రత్నం తిరుపతి పతాకాన్ని ఆవిష్కరించారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హమాలి యూనియన్ అధ్యక్షులు బక్కయ్య జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు గంగయ్య, లస్మయ్య, శేఖర్, జోసెఫ్, పోషం, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కన్నెపల్లి: మండల కేంద్రంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, ప్రగతి శీల యువజన సంఘాల ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్, గోమాస దాగయ్య, రాజలింగు, కార్తీక్, బందయ్య, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలోని దేవాపూర్, కాసిపేట, సోమగూడెంలలో బుధవారం మే డే వేడుకలను కార్మిక సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. జెండాను ఎగురవేశారు.ఏఐటీయూసీ నాయకులు దాగం మల్లేష్, మీనుగు లక్ష్మీనారాయణ, రాజేందర్, గొల్ల శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు, శ్రీహరి, సురేష్, లింగయ్య, సంపత్ పాల్గొన్నారు.


భీమిని: మండలంలో కార్మిక దినోత్సవాన్ని జరుపుకున్నారు. సీఐటీయూ సీనియర్ నాయకురాలు సులోచన జెండా ఆవిష్కరించారు. నాయకులు లక్ష్మి పాల్గొన్నారు.

కోటపల్లి: మండలంలో హమాలీలు, కార్మిక సంఘాల నాయకులు, సీఐటీయూ, మధ్యాహ్న భోజన కార్మికులు జెండాలను ఎగురవేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమాల్లో నాయకులు బాపు, కామెర రవి తదితరులు పాల్గొన్నారు.

భీమారం: భీమారం గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులను ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీఓ రాథోడ్ రాధ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీవో సతీష్‌రెడ్డి, ఏఈ విద్యసాగర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ నాయకుడు ఉస్కమల్ల పున్నంచంద్ ఆధ్వర్యంలో భీమారంలో మే డే వేడుకలను నిర్వహించారు. బస్టాండ్‌నుంచి ఆవడం క్రాస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వమించారు. అనంతరం హమాలీ సంఘం కార్మికులు 60 మందికి టీషర్ట్‌లు అందజేయడంతో భోజనాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోడేటి రవి, ఉస్కమల్ల శ్రీనివాస్, మాజీ సర్పంచు గద్దె రాంరెడ్డి,ప్రకాష్‌రెడ్డి, శ్రీనివాస్, రాజన్న, లింగయ్య పాల్గొన్నారు.



మంచిర్యాల మున్సిపల్ కార్యాలయం ఎదుట జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



బెల్లంపల్లిలో వేడుకల్లో పాల్గొన్న హమాలీ సంఘం నాయకులు

మతోన్మాద రాజకీయాలను ఓడిద్దాం

సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్

మంచిర్యాల కలెక్టరేట్: మతోన్మాద రాజకీయాలను ఓడిద్దామని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మే డే సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను, సహజ సంపదలను ప్రైవేటు పెట్టుబడి దారులకు ప్రధాని మోదీ అప్పగిస్తున్నారని చెప్పారు. వీటిని తిప్పికొట్టేందుకు కార్మికులందరు కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, నాయకులు ఖలీందర్‌అలీఖాన్, మిట్టపల్లి పౌలు, సమ్మయ్య, మల్లయ్య, కిషన్‌రావు, రాజేశ్వర్‌రావు, రవి, పోచన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన కలెక్టర్

మందమర్రిరూరల్, మే 1 : ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో మండలంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు నవదీప్, రిషితవర్మలు 10 జీపీఏ సాధించగా బుధవారం జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ విద్యార్థులను అభినందించారు. బాగా చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. అలాగే డీఈవో యాదయ్య విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయకృష్ణరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

లక్షెట్టిపేటరూరల్, మే 1: లక్షెట్టిపేట మండలంలోని జెండా వెంకటాపూర్ జడ్పీఎస్ఎస్ పాఠ శాలలో పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను బుధవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యా యురాలు యశోదర మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించి ఉపాధ్యాయుల నమ్మ కాన్ని కాపాడారన్నారు. కారుకూరి సాత్విక 9.8 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

తాండూర్: తాండూర్ మండలంలోని ఒడ్డెర కాలనీకి చెందిన పోలవేణి హరికృష్ణను బుధవారం ఎస్ఆర్ కళాశాల యాజమాన్యం విద్యార్థి నివాసంలో సన్మానించి ఫోటోఫ్రేమ్‌ను అందజేశారు. హరికృష్ణ హైదరాబాద్‌లోని ఎస్ఆర్ కళాశాల చదు వుతూ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు 463 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచాడు. దీంతో కళాశాల యాజమాన్యం హరికృష్ణను సన్మానించింది.

బీఆర్ఎస్‌ను ఆదరించాలి

- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

మందమర్రిరూరల్, మే 1: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. బుధవారం బొక్కలగుట్ట గ్రామంలో అందుగులపేట, పులిమడుగు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాజారమేష్, లౌడం రాజ్‌కుమార్, కిషన్ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా బొక్కలగుట్ట గ్రామంలో రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ బలికొండ కిషన్‌నివాసంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ సమావేశం నిర్వహించారు. కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

శ్రీరాంపూర్, మే 1: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నస్పూర్ మున్సిపాలిటీలోని 5వ వార్డులో బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నడిపెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, యువ నాయకుడు నడిపెల్లి విజిత్ రావు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో పార్టీ నస్పూర్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కార్యదర్శి మెరుగు పవన్ కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గరిసే రామస్వామి, కౌన్సిలర్లు వంగ తిరుపతి, పంబాల గంగ, పట్టణ మహిళా సంయుక్త కార్యదర్శి వైద్య శ్రీలత, నాయకులు గుమ్మడి శ్రీనివాస్, గుంట జగ్గయ్య, గట్టయ్య, రాయలింగు, జనార్ధన్, భానుచందర్, నరేందర్ రెడ్డి, ప్రశాంత్, రఫీక్ ఖాన్, రాజేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మండలంలోని సారంగపల్లి తదితర గ్రామాల్లో బుధవారం రాత్రి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాజారమేష్ ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గుణ, నజీరొద్దీన్, ఫిరోజ్ పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయాలి

మందమర్రిరూరల్, మే 1: ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలో జరుగుతున్న మరమ్మతుల పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులు, వీవో సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిధులు ప్రధానోపాధ్యాయులు, వీవోల ఖాతాల్లో జమ అయ్యాయని, ఈ నిధులను సంబంధించిన గుత్తేదారులకు చెల్లించి పనులను పూర్తి చేయాలన్నారు. ఈ నెల 31 నాటికి పనులను పూర్తి చేయాలన్నారు. ఏపీఎం లలితకుమారి, సీసీలు పరిపూర్ణచారి, సునీత తదితరులు పాల్గొన్నారు

బాధిత కుటుంబానికి పరామర్శ

దండేపల్లి, మే 1: దండేపల్లి మండలం కన్నెపల్లి గ్రామానికి చెందిన మగ్గిడి లక్ష్మయ్య ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ 5,500 ఆర్థిక సాయంను అందజేశారు. గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచు గడికొప్పుల రజిని-సురేందర్ దంపతులు ఆ కుటుంబాన్ని పరామర్శించి 25కేజీల బియ్యం బస్తాను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గూడెం ఎంపీటీసీ తోట మోహన్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ముత్తె నారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు చుంచు నగేష్, ఆకుల తిరుపతి, లశెట్టి చెంద్రయ్య, ముత్తె గురువయ్య, మహేష్, సురేష్, శంకరయ్య, బాపు, దుమ్మని సందిప్, పుల్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

మంచిర్యాల కలెక్టరేట్, మే 1: ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా పనిచేసిన సుబ్బారాయుడు పదవీ విరమణ పొందినందున జిల్లా ఇన్‌చార్జీ వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా నియమితులైన డాక్టర్ అనిత బుధవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సర్వేయలెన్స్ అధికారి ఫయాజ్, మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లకు గుణపాఠం తప్పదు



పార్టీలో చేరిన సంతోష్‌కు కండువా వేస్తున్న ఎమ్మెల్యే వివేక్

మందమర్రి టౌన్, మే 1: పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీలకు ఓటమి తప్పదని, ప్రజలు మళ్లీ వారికి గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ అన్నారు. పట్టణంలోని 3వ జోన్‌కు చెందిన సంగి సంతోష్ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కండువా కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా ఆయా పార్టీలకు చెందిన నాయకులతో పాటు అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పార్టీలో చేరుతున్నారన్నారు. ముఖ్యమంత్రి పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. దేశానికి కాంగ్రెస్ పార్టీనే శ్రీరామరక్ష అని అన్నారు. తన తండ్రి కాకా వెంకటస్వామి స్ఫూర్తితో నిరంతరం ప్రజా సేవ లక్ష్యంగా తాను, తన సోదరుడు, తన కుమారుడు పని చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, గుడ్ల రమేష్, మహంత్ అర్జున్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

మందమర్రిటౌన్, మే 1: పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీవివేక్‌కు ఓటు వేయాలని బుధవారం పట్టణంలోని యాపల్, అంగడిబజార్, సీఎస్పీ రోడ్డు తదితర ప్రాంతాల్లో నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు నోముల ఉపేందర్‌గౌడ్, జిల్లా నాయకుడు సొత్కు సుదర్శన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, సంతోష్‌గౌడ్, రవి తదితరులు పాల్గొన్నారు.

నీటి ఏర్పాట్లపై అధికారులు దృష్టి

- వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు సిబ్బంది చర్యలు



ట్యాంకర్ ద్వారా సాసర్‌వెల్‌లను నింపుతున్న సిబ్బంది

జన్నారం, మే 1: గతంలో ఎన్నడూ లేని విధంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎండలు 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు దాటిపోతున్నాయి. దీంతో సాధారణ జనంతో పాటు వన్య ప్రాణులు దాహార్తి తీర్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నాయి. దీంతో అటవీ శాఖ ఈసారి ఎన్నడు లేని కష్టాలు ఎదురవుతున్నాయి. ఓ పక్క కడెం ప్రాజెక్టులో నీరు లేకపోవడంతో కవ్వాల టైగర్ జోన్ గుండా వెళ్లే కెనాల్‌లోని నీరు వెళ్లకుండా నిలిచిపోయింది. దీంతో అటవీ శాఖ అధికారులు క్రత్రిమ నీటి ఏర్పాట్ల కోసం చర్యలు చేపట్టారు. దీనికి తోడు గత నెల నుంచి ఎండలు ఎక్కువ ఉండడంతో ఎక్కడ నీరు అక్కడే ఇంకిపోవడంతో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమ య్యారు. జన్నారం డివిజన్‌లోని ఇందన్‌పల్లి, తాళ్లపేట, జన్నారం రేంజ్‌లలో అటవీ శాఖ అధికారులు మరో ఆరు సోలార్ పంపులను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. అదే విధంగా ర్యాంపు వేలు ఏర్పాటు చేసి నీటిని నింపేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. అంతేకాకుండా దట్టమైన అటవీ ప్రాంతంలో గుట్టల వద్ద సాసర్‌వెల్‌లు ఏర్పాటుచేసి నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతున్నారు. ప్రతీ రెండు కిలోమీటర్ల పరిధిలో వన్య ప్రాణులకు నీరు దొరికేలా చర్యలు చేపడుతున్నారు. వాగుల్లో , అడవుల్లోని నీటి ఊటల వద్ద చెలిమలు తవ్వి నీరును ఏర్పాటు చేస్తున్నారు.



సోలార్ ద్వారా నీటిని నింపుతున్న అధికారులు

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే హరీష్‌బాబు



బెజ్జూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

బెజ్జూరు, మే 1: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని రెబ్బెన గ్రామంలో బీజేపీ ఎంపీఅభ్యర్థి గొడెంనగేష్‌తో కలిసి ఎన్నికలప్రచారం నిర్వహించారు. దేశంలోమూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రధానిమోదీ ఆధ్వర్యంలో అభివృద్ధికి పాటుపడుతామన్నారు. ఎంపీగానగేష్‌ను గెలిపించినట్లయితే ఇద్దరం కలిసి జోడెద్దుల్లాగా పనిచేసి సిర్పూర్ అభివృద్ధికి పాటుపడుతామన్నారు. ఇప్పటికేకేంద్రం నుంచి 100కోట్ల నిధులు తెచ్చి అభివృద్ధికి కృషిచేస్తున్నామన్నారు. ఎంపీఅభ్యర్థి నగేష్ మాట్లాడుతూ తనకు ఒకసారిఅవకాశం కల్పించినట్లయితే నియోజకవర్గానికి అధిక నిధులు తీసుకువచ్చి అభివృద్ధికి పాటుపడుతానన్నారు.

వేంపల్లి రైల్వేఓవర్‌బ్రిడ్జి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

సిర్పూర్(టి): మండలంలోని వేంపల్లి రైల్వేఓవర్ బ్రిడ్జిపనులను బుధవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, బీజేపీ జిల్లాఅధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ పరిశీలించారు. పనులనుత్వరగా పూర్తిచేయాలన్నారు. అనంతరం టోంకిని సిద్ధిహనుమాన్ ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

లింగాపూర్, మే 1: సీఎం సభను విజయవంతం చేయాలని టీపీసీసీ సభ్యుడు రాథోడ్‌గణేష్, ఎస్టీసెల్ జిల్లాఉపాధ్యక్షుడు చవాన్ సునీల్‌కుమార్ అన్నారు. బుధవారంవారు లింగాపూర్ మండలకేంద్రంతోపాటు మండలంలోనిగ్రామాల్లో తిరుగుతూ నేడుఆసిఫాబాద్ జిల్లాకేంద్రంలో ముఖ్యమంత్రి బహిరంగ సభకు మండల ప్రజలు భారీగా తరలిరావాలని వారు కోరారు.

ఊపందుకున్న బీఆర్ఎస్ ప్రచారం

జైనూర్, మే 1: బీఆర్ఎస్‌పార్టీ ఎంపీఅభ్యర్థి ఆత్రంసక్కును గెలిపించాలని ఆపార్టీ నాయకులు ఎంపీపీ కుంరతిరుమల, వైస్ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, పార్టీ ఉపాధ్యక్షుడు ఆత్రంశంకర్ కొలాం తదితరులు బుధవారం మండలంలోని గూడామామడ, పాట్నాపూర్ తదితరగ్రామాల్లో ప్రచారం చేశారు. మాజీ ఎంపీపీ అనకకళాబాయి, మాజీసర్పంచులు మేస్రం పార్వతీబాయి, ఉపసర్పంచ్ సావిత్రిబాయి తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

చింతలమానేపల్లి: బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు రాజన్న, నీలాగౌడ్ కోరారు. బుధవారం మండలంలోని దిందా గ్రామంలో ఆత్రం సక్కు తరఫున వారు ప్రచారం నిర్వహించారు.

ముగిసిన ఎల్లమ్మ బోనాల జాతర

తిర్యాణి, మే 1: మండలంలో గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రేణుక ఎల్లమ్మబోనాల జాతర బుధవారంతో ముగిసింది. బుధవారం ఉదయం ఎల్లమ్మ, జమదగ్నిమునిరాజ్ కల్యాణవేడుకను ఘనంగా నిర్వహించారు. ఎల్లమ్మకల్యాణం సందర్భంగా అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. బైండ్లవారి పాట శివసత్తుల ఆటలతో ఊరంతా హోరెత్తింది. అమ్మవారికల్యాణంతో ఆరురోజులుగానిర్వహిస్తున్న కార్యక్రమాలు ముగిశాయి. కార్యక్రమంలో పెద్దఎత్తున గౌడకులస్తులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఆర్మీజవాన్లకు ఘన స్వాగతం

కాగజ్‌నగర్, మే 1: కాగజ్‌నగర్ మండలం విలేజీనెంబరు5,12కు చెందిన ఆర్మీజవాన్లు బుధవారం పదవీ విరమణ పొంది కాగజ్‌నగర్‌కు వచ్చిన సందర్భంగా రైల్వేస్టేషన్‌లో రిటైర్డ్ ఆర్మీఅసోసియేషన్ సభ్యులు వారికి ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా రిటైర్డ్‌ఆర్మీ జవాన్లు గోకుల్ మేస్త్రీ, ధనుంజయ్ సర్కార్ మాట్లాడుతూ దేశానికి చేసిన సేవ ఎంతో తృప్తినిచ్చిందన్నారు.

ముత్తు బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు

కాగజ్‌నగర్ టౌన్, మే 1: కాగజ్‌నగర్ సర్‌సిల్క్ ఎఫ్ కాలనీలోని ముత్తు బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు బుధవారం ప్రారంభించినట్టు ప్రధానకార్యదర్శి, మాస్టర్ శేఖర్ తెలిపారు. బుధవారం స్థానికంగా ఆయన మాట్లాడారు. ఈనెల31వరకు ఉచితబాక్సింగ్ శిక్షణఇవ్వనున్నట్టుతెలిపారు.

ఆలయ కమిటీ సభ్యుల శ్రమదానం

రెబ్బెన, మే 1: గోలేటిలోని హనుమాన్ ఆలయం నుంచి సేవాలాల్ ఆలయం వెళ్లేరహదారి పూర్తిగా గుంతల మయమైంది. బుధవారం గోలేటి సేవాలాల్ ఆలయకమిటీసభ్యులు శ్రమదానం చేసి గుంతలను పూడ్చారు. అధికారులు స్పందించి నూతన రోడ్డు వేయాలని డిమాండు చేశారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించిన ఎస్ఈ

రెబ్బెన, మే 1: మండలంలోని నంబాల విద్యుత్ సబ్ స్టేషన్‌ను ట్రాన్స్ ఏఈ ఆపరేషన్ వి వాసుదేవ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా 33/11కేవీ భట్టుపల్లి నుంచి ప్రత్యేకలైన్ పనులను పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే కరెంటు సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

జైనూర్, మే 1: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలకు ఆకర్షితులై పలువురు బీఆర్ఎస్‌నాయకులు డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా మాజీవార్డు సభ్యుడు రహీం, ఉపసర్పంచ్ షేక్‌అబ్బు, షేక్ షఫీక్ అన్సారి తదితరులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం విశ్వప్రసాద్‌రావ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు.

తాండూర్ ఎస్సై సస్పెన్షన్


ఎస్సై జగదీష్

తాండూర్, మే 1: పీడీఎస్ బియ్యం అక్రమ దందా కేసు వ్యవహారంలో దర్యాప్తులో అలసత్వంగా వ్యవహరించినందుకు తాండూర్ ఎస్సై కె జగదీష్‌ను మల్టీ జోన్ 1ఐజీ ఏవీ రంగనాథ్ సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల నిర్వహణ, నేర సమీక్షపై రామగుండం కమిషనరేట్ కార్యాలయానికి వచ్చిన మల్టీ జోన్ 1 ఐజీ పీడీఎస్ బియ్యం కేసులపై సమీక్ష నిర్వహించారు. గత నెల 20న తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన పీడీఎస్ బియ్యం అక్రమ దందా కేసు పై సమీక్ష జరిపారు. ఈ కేసులో ఎస్సై జగదీష్ అలసత్వంతో వ్యవహరించడంతో పాటు పలు ఆరోపణలు రావడంతో సస్పెండ్ చేస్తున్నట్లు ఐజీ వెల్లడించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

దండేపల్లి, మే 1: దండేపల్లి మండలం కొర్విచెల్మ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-02లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు బుధవారం మండలంలోని ముత్యంపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కలుసుకున్నారు. 22 ఏళ్ల తర్వాత మళ్లీ పాఠశాలలో చదువుకున్న వారందరు కలుసుకుని చిన్ననాటి సంగతులు గుర్తు చేసుకున్నారు. ఆనాడు తమకు పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు సహపంక్తి భోజనం చేశారు.

గోదావరి పరివాహక ప్రాంతాల్లో విమానం చక్కర్లు

- లైడార్ సర్వేగా తేల్చిన అధికారులు


జైపూర్‌లో చక్కర్లు కొడుతున్న విమానం

జైపూర్, మే 1: మంచిర్యాల పరిధిలోని గోదావరి నది ప్రాంతాల్లో 15 రోజుల నుంచి విమానం చక్కర్లు కొట్టడం ప్రజల్లో ఆసక్తి , ఆందోళన రేకెత్తిస్తోంది. జిల్లాలోని మారుమూల గ్రామాల్లో అది కూడా అతి తక్కువ ఎత్తులో విమానం వెళ్తుండడంతో ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఇంత తక్కువ ఎత్తులో ఎటు వైపు వెళ్తుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఉదయం భారీ శబ్దంతో గోదావరి నది ప్రవాహం గుండా అటు ఇటు విమానం చక్కర్లు కొట్టింది. పల్లెల్లోను వాయువేగంతో దూసుకువెళ్తుంది. పార్లమెంట్ ఎన్నికల వేళ కావడంతో ఎవరో వీఐపీ వస్తున్నారని ప్రజలు భావించారు. 15 రోజుల నుంచి ఇదే తీరున విమానం చక్కర్లు కొడుతుండడంతో ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా సర్వే కోసం వెళ్తుందా , లేదా ఇంకా ఏదైనా పని కోసం తిరుగుతుందా అని తెలియక ప్రజలు, స్థానిక అధికారులు హైరానా పడుతున్నారు. మహారాష్ట్ర , ఛత్తీస్‌గడ్, తెలంగాణ సరిహద్దు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు కావడంతో నక్సల్స్ ఆచూకీ కనుగొనేందుకు పోలీసులు ఏరియల్ సర్వే చేస్తు న్నారా?, ఏదైనా శిక్షణ సంస్థ విద్యార్థుల కోసం తిరుగుతుందా ? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై జైపూర్ ఏసీపీ వెంకటే శ్వర్లును వివరణ కోరగా 15 రోజుల నుంచి మంచిర్యాల జిల్లా , పెద్దపల్లి జిల్లా పరిధిలో జెట్ విమానం చక్కర్లు కొడుతుందని చెప్పారు. ఇది గ్రీన్‌ఫీల్డ్ హైవే రహదారి సర్వే కోసమని తెలిపారు. దీన్ని లైడార్ సర్వే అంటారని. ప్రజలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివరించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నెన్నెల, మే 1: ఏనుగుల గుంపు మహారాష్ట్ర నుంచి ప్రాణహిత నది దాటి మన ప్రాంతానికి వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కుశ్నపల్లి ఎఫ్ఆర్‌వో గోవింద్‌చంద్ సర్దార్ అన్నారు. ఎనుగులు వస్తే వాటిని నియంత్రించేందుకు అటవి శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. మండల కేంద్రంలో బుధవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, గ్రా మ కార్యదర్శులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఎనుగు లు వస్తే తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తల గూర్చి వివ రించారు. ముందస్తుగా ప్రజలకు పూర్తి స్థాయి అవ గాహన కల్పించాలన్నారు. ఏనుగులకు దూరంగా ఉండాలని, వాటితో ఫోటోలు దిగేందుకు ప్రయత్నించ కూడదన్నారు. కర్రలతో బెదిరిస్తే ఎదురు దాడికి దిగుతా యన్నారు. గ్రామ పరిసరాల్లోకి వస్తే పక్కా భవనాల్లోకి వెళ్లి తలదాచుకోవాలని సూచించారు. ప్రాణహిత నది పరివాహక ప్రాంతంలో చెరుకు, కర్బూజా, మక్క, జొన్న లాంటి పంటలకు బదులు నిమ్మ, సంత్రా, మిర్చి లాంటి పంటలు వేసుకోవాలని సూచించారు. చెరుకు, కర్బూజా లను ఏనుగులు ఇష్టంగా తింటాయని ఆ పంటలు ఉంటే గుంపు ఇటు వైపు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుం దన్నారు. ఎనుగులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అటవి శాఖతో పాటు పోలీసు, విద్యుత్, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లాత్, రెడీమేడ్ సంఘం మండల కార్యవర్గం

హాజీపూర్, మే 1: క్లాత్ అండ్ రెడీమేడ్ మర్చంట్ హాజీపూర్ మండల కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా గూడ వెంకటేష్, అధ్యక్షుడిగా గూడ బాలకిషన్, ప్రధాన కార్యదర్శులుగా సామల మనోజ్, కోశాధికారిగా చిరంజీవి, ఉపాధ్యక్షునిగా మహేష్, కార్యదర్శులుగా శ్రీకాంత్, రాజమౌళి, రమేష్, సాయిలను ఎన్నుకున్నారు.

ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో బెల్లంపల్లి మావోయిస్టు మృతి


రవి అలియాస్ అశోక్ మృతదేహం

బెల్లంపల్లి, మే 1: ఛత్తీస్‌గడ్ అడవుల్లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణానికి చెందిన కాసరవేని రవి అలియాస్ అశోక్ అనే మావోయిస్టు మృతిచెందాడు. పట్టణంలోని కన్నాల బస్తీకి చెందిన రాజయ్య-లక్ష్మి దంపతుల చిన్న కుమారుడు రవి అలియాస్ అశోక్ 1991లో మావోయిస్టులబాట పట్టాడు. మొదటగా పీపుల్స్ వార్ పార్టీ అనుబంధ సంఘమైన సికాసలో పనిచేశాడు. వివిధ హోదాల్లో పనిచేసి డీసీఎం అయ్యాడు. ఛత్తీస్‌గడ్ అడవుల్లో పోలీసు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన రవి అలియాస్ అశోక్ కుటుంబీకులు ప్రస్తుతం బెల్లంపల్లిలో ఉండడం లేదు. ఛత్తీస్‌గడ్‌లో రెండ్రోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినట్లు అక్కడి పోలీసులు హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలో ఉంటున్న రవి సోదరుడు వెంకట్‌కు సమాచారం అందించారు. దండకారణ్యం డీవీసీఎం స్థాయిలో రవి ఉన్నట్లు అక్కడి పోలీసులు రవి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో బుధవారం మధ్యాహ్నం రవి సోదరుడు వెంకట్‌తో పాటు మరికొంత మంది కుటుంబ సభ్యులు రవి మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు ఛత్తీస్‌గఢ్ వెళ్లారని సమాచారం

- 33 ఏళ్ల క్రితం అడవిబాట

రవి అలియాస్ అశోక్ సుమారు 33 ఏళ్ల క్రితం అటవిబాట పట్టాడు. కేశవభోయిన రాజయ్య-లచ్చమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కూతురు ఉంది. వృత్తిరీత్యా రాజయ్య సింగరేణి కార్మికుడిగా బెల్లంపల్లిలో పనిచేశాడు. వారి స్వస్థలం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామం. వారి చిన్న కుమారుడు రవి అలియాస్ అశోక్. బెల్లంపల్లి పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నాడు. విప్లవ సాహిత్యానికి ఆ కర్షితుడయ్యాడు. మొదటగా సికాస (సింగరేణి కార్మిక సమాఖ్య)లో కొన్నేళ్ల పాటు పనిచేశాడు. మావోయిస్టు కార్యకలాపాలు చురుకుగా ఉండడంతో దండకారణ్యంలోకి వెళ్లి వివిధ హోదాల్లో పని చేశాడు. డీసీఎం స్థాయికి ఎదగడంతో ప్రభుత్వం రవి అలియాస్ అశోక్‌పై రివార్డు సైతం ప్రకటించింది. దండకారణ్యంలో పోలీసులు, మావోయిస్టులకు జరిగిన కాల్పుల్లో ఎన్నో సార్లు తప్పించుకున్న సంఘటనలు సైతం ఉన్నాయి.

అక్రమ కేసులతో యాజమాన్యం బెదిరింపులు

- కార్మిక సంఘం నాయకులు శంకర్, శ్రీనివాస్, ప్రకాష్

ఏసీసీ, మే 1 : మంచిర్యాల పట్టణంలోని పాత మంచిర్యాలలోని శాలివాహన పవర్ ప్లాంట్ యాజమాన్యం 2022 డిసెంబర్‌లో ప్లాంట్‌ను మూసివేసినప్పటి నుంచి కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్ చెల్లించకుండా కార్మికులపై అక్రమ కేసులు నమోదు చేయిస్తూ బెదిరింపులకు పాల్పడుతుందని కార్మిక సంఘం నాయకులు కుంటాల శంకర్, ఎడ్ల శ్రీనివాస్, ప్రకాష్‌లు అన్నారు. మంచిర్యాలలోని కోర్టులో విచారణలో ఉన్న కేసు పేషీకి బుధవారం హాజరైన అనంతరం కోర్టు బయట మాట్లాడారు. కార్మికులకు రావాల్సిన క్లోజింగ్ బెనిఫిట్స్ చెల్లించాలని యాజమాన్యానికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు బీఎంఎస్ ఆధ్వర్యంలో ప్లాంటు ఎదుట రిలే నిరాహార దీక్షలకు పూనుకున్నామన్నారు. కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్ చెల్లించ కుండా కంపెనీ ఎండీ మల్క కొమురయ్య, డైరెక్టర్ మల్క నవీన్‌కుమార్ తమపై పోలీస్‌స్టేషన్‌లో అక్రమ కేసులు నమోదు చేయించడంతో సివిల్ కోర్టుల్లో అక్రమ కేసులు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్‌కు సంబంధించిన కేసు జాయింట్ లేబర్ కమిషనర్ వరంగల్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉండగా కార్మికులపై సివిల్ కోర్టుల్లో, పోలీస్‌స్టేషన్‌లలో కేసులు వేయడం బాధకరమన్నారు. కేసులతో బెదిరించడం మానుకుని కార్మికుల బెనిఫిట్స్ వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆనందరావు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్యను పెంచాలి

మందమర్రిరూరల్, మే 1: మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 200 కూలీలతో పనులను చేయించాలన్నారు. ప్రతి కూలీకి వేతనం రూ. 250కి పైగా ఉండేలా చూడాలన్నారు. ఏడు రిజిష్టర్‌లను సక్రమంగా మెయింటెన్ చేయాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున పని ప్రదేశాల్లో తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో రజియాసుల్తానా, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైలుఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఏసీసీ, మే 1: మంచిర్యాల - మందమర్రి రైల్వేస్టేషన్‌ల మధ్య బుధవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి గుర్తు తెలియని రైలు ఢీకొని మృతిచెందాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని రైల్వే హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు. రైల్వే ఎస్ఐ సుధాకర్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. మృతుని సంబంధీకులు 8328512176లో సంప్రదించాలని సూచించారు.

షాపులను మూసివేయించిన అధికారులు

ఏసీసీ, మే 1: జిల్లా కేంద్రంలో బుధవారం మే డే సెలవు ఉన్నప్పటికీ తెరిచి ఉంచిన షాపులను కార్మిక శాఖ అధికారులు మూసివేయించారు. కార్మిక శాఖ ఫీల్డ్ అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో అధికారులు పట్టణంలో తిరుగుతూ తెరిచి ఉంచిన షాపులను మూసివేయించారు. ఈ విషయం అధికారులను వివరణ కోరగా పై అధికారుల ఆదేశాల మేరకు షాపులను మూసివేయించామని తెలిపారు.

ప్రచారాన్ని అడ్డుకున్న గ్రామస్థులు

కోటపల్లి, మే 1 : తమ సమస్యలు పరిష్కారం అయ్యేదాక ఓట్లు వేసేది లేదని తీర్మానించిన మండలంలోని రాజారం గ్రామస్థులు బుధవారం ఆ గ్రామంలో కాంగ్రెస్ ప్రచార రథాన్ని అడ్డుకున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామానికి ప్రచార రథం వెళ్లగా గ్రామ సరిహద్దులోనే స్థానికులు ప్రచార రథాన్ని అడ్డుకున్నారు. తాము ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించినా ఇక్కడి ఎమ్మెల్యే గడ్డం వివేక్ తమ ఆవేదనను పట్టించుకోవడం లేదనిన్నారు. తమను ఓట్లు అడిగేందుకు మాత్రమే వస్తున్నారు కానీ ప్రజల అవస్థలు వారికి కానబడడం లేదని వవాపోయారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యల పరిష్కారం జరిగే వరకు ఏ పార్టీ నాయకులను గ్రామంలోకి రానివ్వమని హెచ్చరించారు.

'బీజేపీపై అసత్య ప్రచారం'

చెన్నూరు, మే 1: బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బీజేపీపై అసత్య ప్రచారం చేస్తున్నాయని పార్టీ బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ వెంకటేశ్వర్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకన్న అన్నారు. పట్టణంలోని చెన్నూరు ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో బుధవారం వారు మాట్లాడారు. బీజేపీ పార్టీపై బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కావాలని లేని పోని ఆరోపణలు చేస్తున్నాయన్నారు. గతంలో రాష్ట్రం, కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిందేమి లేదన్నారు. చెన్నూరు నియోజకవర్గంలోని ప్రజల సమస్యలపై తాము పోరాడి అభివృద్ధి పనులను చేయించామన్నారు. ప్రజలు గమనించి బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మాటలను నమ్మకూడదని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు శివకృష్ణ, జాడి తిరుపతి, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్లను రద్దు చేసిన రైల్వే శాఖ

కాగజ్‌నగర్, మే 1: కాగజ్‌నగర్-సికింద్రాబాద్ మధ్యలో నడుస్తున్న మూడోట్రాక్ పనుల దృష్ట్యా పలు రైళ్లను రైల్వే శాఖ రద్దు చేసింది. రద్దు చేసిన వాటిలో 07335 భద్రాచలం రోడ్ స్పెషల్‌రైలు, 07336 బెల్గావి రైలు, 17233 సికింద్రాబాద్-కాగజ్‌నగర్, 17234కాగజ్‌నగర్-సికింద్రాబాద్ భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల వచ్చేనెల9 వరకు రద్దు చేశారు. అలాగే 06589 బెంగళూరు-మీరజ్, 06590 మీరజ్-బెంగుళూరు వరకు వెళ్లే ఎస్‌బీసీ స్పెషల్ రైళ్లను కూడా వచ్చే నెల13 వరకు రద్దు చేసినట్టు రైల్వేశాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

మామిడి మార్కెట్‌ను తీసుకొస్తాం

- బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే

నెన్నెల, మే 1: పెద్దపల్లి ఎంపీగా తాను గెలిస్తే జిల్లాలో మామడి మార్కెట్‌ను తీసుకొస్తామని భారతీయ జనతా పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే అ న్నారు. మండల కేంద్రంలో బుధవారం రోడ్ షో నిర్వహించారు. అనంతరం సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మార్కెట్ సౌకర్యం లేక ఇక్కడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మామిడి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా మామిడి మార్కెట్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. మండల కేంద్రంలో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు వెర్రబెల్లి రఘునాథ్, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, పార్టీ మండల అధ్యక్షులు శైలెందర్‌సింగ్, శేషగిరి, గోవర్ధన్, వెంకటకృష్ణ, సంతోష్, శేఖర్ పాల్గొన్నారు.

భీమిని: మండల కేంద్రంలో బుధవారం పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీ వెంకటేష్ నేత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, బీజేపీ మండల అధ్యక్షుడు కొంక సత్యనారాయణ, నాయకులు పులగం తిరుపతి, ఇప్పకాయల వెంకటేష్, రమేశ్, పోతురాజుల శంకర్ పాల్గొన్నారు.

వేమనపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే అన్నారు. బుధవారం వేమనపల్లిలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. అనంతరం బీజేపీ నాయకులు ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయలు, వెంకటకృష్ణ, సంతోష్, సత్యం, మధుకర్,చౌదరి, మదునయ్య, అంజి, పుల్లయ్య, రాజన్న పాల్గొన్నారు.

కన్నెపల్లి: మండల కేంద్రంలో బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి శ్రీని వాస్ గొమాసే, ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీదేవి, గోవర్ధన్, రామయ్య యాదవ్, రాజయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు

ఏసీసీ, మే 1: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటు న్నామని మంచిర్యాల సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆపరేషన్ సర్కిల్ శ్రావణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆల్టర్‌నేట్ సప్లై కొరకు 17.7 కిలోమీటర్ల 33కేవీ లైన్ లక్షెట్టిపేట నుంచి తపాల్‌పూర్ వరకు నిర్మించామని తెలిపారు. చెన్నూరు, బెల్లంపల్లి సబ్ డివిజన్‌లో 11కేవీ ఫీడర్‌ల బలోపేతం కోసం రూ. 6 కోట్లతో పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. సుమారు కోటి రూపాయలతో ఆర్కే 6 సబ్ స్టేషన్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీని పెంచామని తెలిపారు. పెరిగిన వినియోగదారుల విద్యుత్ డిమాండ్ వరకు 132 కేవీ కెపాసిటీ గల వివిధ అదనపు విద్యుత్ నియంత్రికలు ఏర్పాటు చేశామని తెలిపారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు

సుల్తానాబాద్, మే 1 : దైవదర్శనానికి వెళ్లివస్తున్న ఓ కుటుంబం అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. సింగరేణి అండ్రియాల ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న ఓ కార్మికుడి కుటుంబం మొక్కు చెల్లించడానికి ఏప్రిల్ 27 తిరుమలకు కారులో వెళ్లారు. తిరిగి వస్తుండగా సుల్తానాబాద్ పట్టణంలో రాజీవ్ రహదారి వద్ద ఐబీ చౌరస్తా దాటిన తర్వాత మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. కారు ముందు టైర్ పేలిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న కొందరికి స్వల్పగాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని కారును పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

అరవై ఏళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం: గోడం నగేష్


కౌటాలలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి నగేష్

కౌటాల, మే 1: అరవై ఏళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని బీజేపీ ఎంపీఅభ్యర్థి గోడం నగేష్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 60 సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తూ వచ్చిందని మళ్లీ మోసపూరిత వాగ్దానాలతో రాష్ట్రంలో గద్దెనెక్కిందన్నారు. బీజేపీ ఆధ్వర్యంలోనే అభివృద్ధి సాధ్యమన్నారు. గతంలో తాను ఎంపీగా, మంత్రిగా రాష్ట్రంలో అభివృద్ధికి కృషిచేశానని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మాయమాటలు చెప్పే నాయకుల మాటలు నమ్మవద్దన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, సత్యనారాయణ, రాజేందర్‌గౌడ్, మిథున్, భీమన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి: ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని గోడం నగేష్ అన్నారు. మండలంలోని రవీంద్రనగర్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడారు. తనను ఎంపీగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు చెప్పే మాటలను నమ్మకుండా దేశాభివృద్ధికి పాటుపడే బీజేపీని, తనను గెలిపించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ ఎంపీ నగేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే రామలక్ష్మణులలగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఉదయం వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కాసేపు మాట్లాడి ఎన్నికల్లో తనను గెల్పించాలని కోరారు. అనంతరం పట్టణంలోని పోచమ్మ బస్తీ, మార్కెట్‌ఏరియాలో ఇంటింటా తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో తనను తప్పకుండా గెల్పించాలన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న సమస్యలను దశల వారిగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నిరుపేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినట్టు పేర్కొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు మాట్లాడుతూ ఈ ప్రాంత సమస్యలు కేంద్రం దృష్టికి పోవాలంటే బీజేపీ అభ్యర్థి గోడం నగేష్‌ను అధిక మెజార్టీతో గెల్పించాలని పిలుపునిచ్చారు. వారివెంట అరుణ్‌లోయా, సిందం శ్రీనివాస్, దెబ్బటి శ్రీనివాస్, గజ్జల లక్ష్మణ్, వలుపదాసు రమేష్ ఉన్నారు.

బీజేపీ ప్రభుత్వంతోనే మహిళల అభివృద్ధి: 'అరిగెల'

ఆసిఫాబాద్ రూరల్: బీజేపీతోనే మహిళల అభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీనాయకుడు జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని సందీప్‌నగర్ కాలనీకి చెందిన మహిళలు బీజేపీలో చేరడంతో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రధాని మోదీ మహిళల కోసం అనేక సంక్షేమపథకాలు ప్రవేశ పెట్టారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటువేసి ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



వాంకిడిలో జెండాను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు



కాగజ్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



ఆసిఫాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఘనంగా కార్మిక దినోత్సవం

- ఐక్య పోరాటాలతో హక్కులు సాధించుకోవాలి
- మే డే సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు

ఆసిఫాబాద్, మే 1: ఐక్యఉద్యమాలతోనే హక్కులను సాధించుకోవచ్చని కార్మిక సంఘాల నాయకులు అన్నారు. మేడే పురస్కరించుకుని బుధవారం ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంలో ఆయాకార్మిక సంఘాల ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఆయా కార్యాలయాల్లో మే డే జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐక్య ఉద్యమాలతోనే హక్కులను సాధించుకోవచ్చని పేర్కొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లాకార్యదర్శి బద్రి సత్యనారాయణ, ఏఐటీయూసీ నాయకులు ఉపేందర్, సీఐటీయూ నాయకులు రాజు, శ్రీనివాస్, శ్రీకాంత్, దినకర్, కార్తీక్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలో బుధవారం మేడే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ రంగాల కార్మికులు పట్టణంలో పలు వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లాకార్యదర్శి కూశన్న రాజన్న మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కార్మిక శక్తిని అణగతొక్కాలని ప్రయత్నిస్తోందన్నారు. సీపీఎం సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జీ ముంజం ఆనంద్ కుమార్ మాట్లాడుతూ కార్మికవర్గం పోరాడి సాధించుకున్న స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు కోల్పోయే దుస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్రకార్యదర్శి త్రివేణి, సీపీఎం నాయకులు కోట శ్రీనివాస్, పద్మ, అనిత, సాయికృష్ణ, మల్లన్న, శంకర్, సంజీవ్, శంకరమ్మ పాల్గొన్నారు. అలాగే ట్రాన్స్‌కో కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం (ఏఎన్‌టీయసీ)-327 ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎమ్మాజీ సతీష్ మాట్లాడుతూ కార్మికులహక్కుల కోసం ఐఎన్‌టీయూసీ పోరాటంలో ముందుంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్య క్షుడు చంద్రశేఖర్, శ్రీనివాస్, రామకృష్ణ, ప్రదీప్, శ్రీనివాస్, కుమారస్వామి, బుచ్చిబాబు, శకుంతల పాల్గొన్నారు.

చింతలమానేపల్లి: మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మేడే దినోత్సవాన్ని సీఐటీయూ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు విలాస్, రవి, శ్యాంరావు, వెంకటి, ఆశా వర్కర్లు అనురాధ, హంస, లక్ష్మి, అర్చణ, అంగన్‌వాడీ వర్కర్ కళావతి, విమల, కమల పాల్గొన్నారు.

దహెగాం: మండలకేంద్రంలోని బజార్‌ఏరియాలో మేడే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వజ్రమ్మ, జయప్రద, కల్పన, రాజేశ్వరి, భాగ్యలక్ష్మి, రాజ్‌కుమార్, అరుణ్‌గౌడ్, రవీందర్, మారుతి, మమత తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రంలో మే డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు నగేష్, మోరేశ్వర్, అనీల్, తిరుపతి, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: మండలంలో బుధవారం భవన నిర్మాణ సంఘంతోపాటు హమాలీ సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా కార్మిక దినోత్సవం జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, సుధాకర్, అశోక్, దీపక్, ప్రశాంత్, విజయ్, శ్యాంరావు, విలాస్ పాల్గొన్నారు.

తిర్యాణి: మండల కేంద్రంలో బుధవారం మే డేను ఘనంగా నిర్వహించారు. జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో లచ్చుగౌడ్, మొగిలి గౌడ్, జంగు, సత్తయ్య, శంకర్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: మండల కేంద్రంలో సీఐటీయూ నాయకులు ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ పేదల సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శులు కుటికెల శంకర్, సిడాం ధర్ము మాట్లాడుతూ కార్మికులకు రాజ్యాంగ బద్దంగా దక్కాల్సిన హక్కులు అమలు కావడం లేదని ఆరోపించారు. అదేవిధంగా కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు వారు జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. గ్రామీణ పేదల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు సంబా జీ, చాహకటి దేవరావ్, మారుతి, కమల పాల్గొన్నారు.

సిర్పూర్(యు): మండల కేంద్రంలోని గాంధీచౌక్‌లో మే డేను కార్మికులు గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామీణ పేదల సంఘం జిలా కార్యదర్శి కుటికెల శంకర్ మాట్లాడుతూ కార్మికులకు కనీసవేతనం ఇవ్వాలన్నారు. అదేవిధంగా కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులు తమ హక్కుల కోసం సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో చాహకాటి సంబాజీ, టేకం దేవరావు, మారుతి, గంగాధర్ కార్మికులు పాల్గొన్నారు.



సిర్పూర్(యు)లో జెండా ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘం నాయకులు



దహెగాంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు



కౌటాలలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

సీఎం సభకు ఏర్పాట్లు పూర్తి

- భారీగా జనసమీకరణకు సన్నాహాలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క,నాయకులు

ఆసిఫాబాద్, మే 1: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన జనజాతర బహిరంగ సభలో ఆయన పాల్గొననున్నారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా సీఎం జిల్లాకు చేరుకోనున్నారు. ఆసిఫాబాద్‌పట్టణంలోని ప్రేమలగార్డెన్‌సమీపంలో సభాస్థలిని ఏర్పాటు చేశారు. జనజాతర బహిరంగసభలో పాల్గొని కాంగ్రెస్‌పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రంసుగుణక్క తరఫున ప్రజలనుద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించనున్నారు.

భారీగా జనసమీకరణ..: ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల పరిధిలో సీఎం సభకు 25వేలమందిని తరలించేందుకు పార్టీనాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాంగ్రెస్‌పార్టీ జిల్లాఅధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావ్ నేతృత్వంలో భారీగా జనాన్ని సమీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలాల వారీగా ముఖ్య నాయకులకు, కార్యకర్తలకు జన సమీకరణ బాధ్యతలను అప్పగించారు

ఏర్పాట్లు పూర్తి..: ముఖ్యమంత్రి సభకు వచ్చే ప్రజలకోసం ప్రత్యేక షామియానాలను ఏర్పాటు చేశారు. హెలిప్యాడ్, సభాస్థలి పనులను మంత్రి సీతక్క, కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావ్, జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల ఇంచార్జ్‌లతో కలిసి పరిశీలించారు. సీఎం పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించనున్నారు. ఎస్పీ సురేష్‌కుమార్ నేతృత్వంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, ప్రత్యేక పోలీసు బలగాలు బందోబస్తులో పాల్గొననున్నారు.

ఈవీఎం గోదాంను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి



ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మే 1: జిల్లా కేంద్రంలో ఈవీఎంలు భద్రపరిచిన గోదాంను రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలకు వందచొప్పున బ్యాలెటింగ్‌యూనిట్లు, కంట్రోలింగ్ యూనిట్లు, వీవీప్యాట్ అవసరం ఉన్నందున గోదాంలో భద్ర పరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను మొదటివిడత పరిశీలన కార్యక్రమం పూర్తిచేసి పార్లమెంట్ ఎన్నికలలో ఉపయోగిస్తున్నామని తెలిపారు. గోదాంలో ఉన్న సీసీటీవీల పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల సూప రింటెండెంట్ మధుకర్, నాయబ్ తహసీల్దార్ జితేందర్, రాజకీయపార్టీల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. వడదెబ్బకు గురైన వారు పాటించాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. వడదెబ్బ బాధితులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈనెల 6వరకు రాష్ట్ర వ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. మధ్యాహ్నం అత్యవసరమైతే తప్ప బయటకురావద్దని తెలిపారు. బయటకు వెళ్లేటప్పుడు గొడుగులు, టోపీలు,కళ్లజోళ్లు ధరించాలని, నీటిశాతం అధికంగా ఉండేపండ్లు తీసుకోవాలన్నారు.

సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి

ఆసిఫాబాద్ రూరల్, మే 1: సమ్మర్ క్రీడాక్యాంపును బుధవారం జిల్లా కేంద్రంలో డీవైఎస్‌వో ఆర్ రమాదేవి ప్రారంభించారు. క్రీడాకారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈక్యాంపు మే1 నుంచి 31 వరకు నెలరోజుల పాటు నిర్వహిస్తామన్నారు. క్యాంపు నిర్వహించే 11మంది శిక్షకులకు కొన్ని సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్సై సోనియా, గిరిజన క్రీడాధికారి మీనారెడ్డి, అథ్లెటిక్స్ శిక్షకుడు విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

టీకాలు సకాలంలో వేయించాలి

వాంకిడి, మే 1: గర్భిణులు, బాలింతలతోపాటు చిన్నపిల్లలు సకాలంలో టీకాలు వేయించాలని ఆరోగ్యశాఖ విస్తరణ అధికారి రవిదాస్ అన్నారు. బుధవారం మండలంలోని ఇందాని ఆరోగ్యకేంద్రంలో వ్యాక్సినేషన్‌పై అవగా హన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ఎండల కారణంగా ప్రజలు అప్రమత్తగా ఉండాలన్నారు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప 11గంటల తరువాత ప్రజలు బయటికి రావద్దన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కాంత, సిబ్బంది సుచరిత, ఆశావర్కర్ గంగుబాయి, కమల తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెరిగేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి

- వీసీలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్

ఆసిపాబాద్, మే 1: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 13న జరుగనున్న పోలింగ్‌లో ఓటింగ్ శాతాన్ని పెంచే విధంగా ఆయా జిల్లాల పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్‌లు, అదనపుకలెక్టర్, ఎన్నికల విభాగం అధికారులతో ఎన్నికల నిర్వహణ, ఓటింగ్ శాతం పెంపుదలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. పోలింగ్ రోజున పూర్తిస్థాయిలో ఓటింగ్ జరిగేలా ప్రత్యేక కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలోని సిర్పూర్, ఆసిఫాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్లలో ఈనెల 13న జరిగే పోలింగ్ రోజున ఓటింగ్ శాతం పూర్తిగా నమోదయ్యే విధంగా జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్య క్రమంలో అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఎన్నికల పర్యవేక్షకుడు మధుకర్, ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చికాగో అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలి

- కార్మిక వాడల్లో, గనులపై ఘనంగా మేడే వేడుకలు



మందమర్రిలో జెండా ఎగురవేస్తున్న ఏఐటీయూసీ నాయకులు



నినాదాలు చేస్తున్న హెచ్ఎంఎస్ నాయకులు

శ్రీరాంపూర్, మే 1: చికాగో అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలని వక్తలు పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో మేడే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) ఏరియా అధ్యక్షుడు గుల్ల బాలాజీ అధ్యక్షతన ఆర్కే7, ఆర్కేన్యూటెక్ గనులపై వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కస్తూరి చంద్రశేఖర్, శ్రీపతి బానేష్, తోడే సుధాకర్, మిడివెల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయం నుంచి శ్రీరాంపూర్ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కార్యాలయంవద్ద, సోమవారం సంత, కటిక దుకాణాలు, కొత్తరోడ్డు, జీఎం కార్యాలయం, అరుణక్కనగర్‌లో ఐఎఫ్‌టీయూ జెండాలను యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డి బ్రహ్మానందం ఆవిష్కరించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో యూనియన్ కార్యాలయం వద్ద, గనులు, విభాగాలలో వేడుకలు నిర్వహించగా, రాష్ట్రఅధ్యక్షుడు వి సీతారామయ్య, ఉప ప్రధాన కార్యదర్శులు కె వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టేకిషన్‌రావు, నాయకులు పాల్గొన్నారు. కాంట్రాక్టు కార్మికసంఘం(ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, బ్రాంచ్ అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్ ఆధ్వర్యంలో వేడుకలు ఏర్పాటుచేశారు. ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ బస్టాండ్‌వద్ద గల కార్మికుడి విగ్రహం వద్ద బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు ఆధ్వర్యంలో వేడుకలు ఏర్పాటు చేయగా, యూనియన్ సెక్రటరీజనరల్ బి జనక్‌ప్రసాద్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో జాతీయ సమితి సభ్యుడు సిహెచ్ భీంరావు, కేంద్ర నాయకులు పాల్గొన్నారు. సింగరేణి ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంక్షేమ సంఘం(1630/82) ఆధ్వర్యంలో కార్మికుడి విగ్రహానికిపూలమాల వేయగా, కుమార్, రాజేం ద్రప్రసాద్, క్రాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు. హెచ్ఎంఎస్ ఏరియాఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో యూనియన్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. షిర్కే సెంటర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో పార్టీ పట్టణ కార్యదర్శి మిర్యాల రాజేశ్వర్‌రావు, మండల సహాయ కార్యదర్శి లింగం రవి జెండా ఆవిష్కరించారు. సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ హాజరై మాట్లాడారు.

మందమర్రి టౌన్: మేడేను బుధవారం ఆయా కార్మికసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చికాగో అమరవీరులకు నివాళులర్పించారు. టీబీజీకేఎస్ కార్యా లయం వద్ద ఏర్పాటు చేసిన జెండాను ఏఐటీయూసీ మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బాల్కసుమన్ ఎగురవేశారు. కార్యక్రమంలో మేడిపెల్లి సంపత్, జె రవిందర్, ఒ రాజశేఖర్‌పాల్గొన్నారు.



ఏటీయూసీ ఆధ్వర్యంలో..

ఏఐటీయూసీ కార్యాలయంవద్ద మేడేను ఘనంగా నిర్వహించారు. ముందుగా జెండాను బ్రాంచికార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు భీమనాథుని సుదర్శన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కంది్రశీనివాస్, గాండ్లసంపత్, సమ్మయ్య, సోముశెట్టి రాజేషం, సాంబయ్య పాల్గొన్నారు. అదే విధంగా మార్కెట్‌సెంటర్లో దివంగత అబ్రహం స్థూపం వద్ద జెండా ఆవిష్కరించారు.

హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో..

పట్టణంలోని హెచ్ఎంఎస్ కార్యాలయంవద్ద యూనియన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. జెండా ఎగరవేసి నివాళులర్పించారు. ఉపాధ్యక్షుడు పార్వతి రాజిరెడ్డి, వెల్ది సుదర్శన్, జె శ్రీనివాస్, తామస్ పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో..

టీఎన్‌టీయూసీ కార్యాలయం వద్ద మే డేను ఘనంగా నిర్వహించారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు సంజయ్‌కుమార్, వాసాల సంపత్, కిష్టయ్య, జయశ్రీ, సంధ్య, ప్రవీణ్, కమల, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: సింగరేణిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే కార్యక్రమాలను గోలేటి ఎక్స్‌రోడ్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించటంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ ముందు ఉంటుందన్నారు. కార్యక్రమంలో బ్రాంచీ అధ్యక్షుడు అరికిల్ల స్వామి, మండలకార్యదర్శి దుర్గం వెంకటేష్, పంచాయతీ అధ్యక్షుడు శంకర్, డ్రైవర్లు మనోహర్, సంఘం సభ్యులు, కార్మికులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

జైపూర్: మండల కేంద్రంలోని ఎస్టీపీపీ వద్ద బుధవారం హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో బుధవారం మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకుడు ఆర్ విక్రమ్ జెండాను ఆవిష్కరించారు. హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ సారయ్య, నాయకులు సందీప్‌రెడ్డి, సాయికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ సీహెచ్‌పీ, ఓసీ, సివిల్ డిపార్టుమెంట్లలో బుధవారం మేడేను ఏఐటీయూసీ సెక్రెటరీ అక్బర్‌అలీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరించి నివాళులర్పించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు, వేజ్‌బోర్డు సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ కార్మికులంతా ఐక్యంగా ఉండాలని, కార్మిక చట్టాలను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్కే ఓసీ కార్మికులు, సివిల్ కార్మికులు పాల్గొన్నారు.

మే డే స్ఫూర్తితో పనిచేస్తాం

- కనీస వేతన మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్

మందమర్రి టౌన్, మే 1: మే డే, అమరుల స్ఫూర్తితోనేముందుకు సాగుతున్నామని రాష్ట్ర కనీస వేతనమండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఆదిజాంబవ సంఘం ఆధ్వర్యంలో స్థానికకార్యాలయంలో కలిసిశాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులహక్కుల సాధనే ధ్యేయంగా తాము పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వాసాల శంకర్, సభ్యులతోపాటు రాజేషం, కాంపెల్లి సమ్మయ్య, దేవి భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో కొత్త భూగర్భ గనులను ఏర్పాటు చేయాలి

కాసిపేట, మే 1: సింగరేణిలో కొత్త భూగర్భ గనులను ప్రారంభించాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్‌కార్యదర్శి దాగం మల్లేష్ అన్నారు. బుధవారం కాసిపేటలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో భూగర్భ గనులు తగ్గిపోయాయన్నారు. గతంలో లక్ష మంది ఉన్న కార్మికులు ఇప్పుడు 40వేలకు చేరుకున్నారన్నారు. వెంటనే భూగర్భ గనులను ప్రారంభించి ఉపాధి అవకాశాలు కల్పిస్తే ఈ ప్రాంతంలో నిరుద్యోగం ఉండదన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, రాజేందర్, సంతోష్, కమలాకర్, రంజిత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలి



పూజల్లో పాల్గొన్న గ్రామస్థులు

బెజ్జూరు, మే 1: ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో నడవాలని బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ దీక్ష గురు సంత్ ప్రేంసింగ్ మహారాజ్ అన్నారు. బెజ్జూరు మండలంలోని లంబాడి గూడలో సేవాలాల్ మహారాజ్ జగదాంబ దేవాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి బంజార సాంస్కృతి సంప్రదాయాల ప్రకారం బోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అందరూ చదువుకోవాలని, సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో నడవాలన్నారు. అనంతరం బంజారాల సమక్షంలో లంబాడీగూడను ప్రేమ్‌నగర్‌గా నామకరణం చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు మోతీరాం మహారాజ్, దుప్పనాయక్, కేసునాయక్, చత్రు నాయక్, వసంత్ నాయక్, భిక్షపతి, మంజినాయక్, సంతోష్ నాయక్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.